క్లుప్తంగా

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



దొరవారిసత్రం : మండలంలోని చందనముడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం జై భీమ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సూళ్లూరుపేటకు చెందిన సుల్తాన్ బాషా, రేహానా రెడీమేడ్ దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో కృష్ణయ్య, హెచ్ఎంలు పద్మజ, శేష య్య, ట్రస్ట్ వైస్ చైర్మన్ సంధ్యాదేవి, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటరమణమ్మ,స్థానికులు పాల్గొన్నారు.

పేదలకు చేయూతే రంజాన్ పరమార్థం



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న షబ్బీర్

నాయుడుపేట టౌన్ : పేదలకు చేయూత ఇవ్వడమే రంజాన్ పండుగ ముఖ్య ఉద్దేశమని వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ సూళ్లూరుపేట నియోజవర్గ కన్వీనర్ షేక్ షబ్బీర్ తెలిపారు. ఆయన గురువారం అగ్రహారపేటలోని తన ఇంటి వద్ద 500 మంది పేద ముస్లింలు, ఎస్సీ, ఎస్టీలకు దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక సూచనల మేరకు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



రైతులతో మాట్లాడుతున్న శివనాయక్

రాపూరు : దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని పొదలకూరు వ్యవసాయ సంచాలకులు శివనాయక్ తెలిపారు. ఆయన గురువారం సిద్ధవరం గ్రామంలో రైతులతో మాట్లాడారు. తేమను బట్టి ధాన్యం ధర నిర్ణయిస్తామన్నారు. వ్యవసాయ అధికారి సోమసుందర్ పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థి ఎంపిక



విద్యార్థి బాలవిష్ణును అభినందిస్తున్న ఎంఈవోలు వెంకటేశ్వర్లు, బాబయ్య

వెంకటగిరి రూరల్ : జవహర్ నవోదయ విద్యాలయకు వెంకటగిరి మండలం మొగళ్లగుంట ప్రాథమిక పాఠశాల విద్యార్థి ఈదూరి బాలవిష్ణు ఎంపికయ్యాడు. బాలుడిని గురువారం ఎంఈవోలు-1, 2 వెంకటేశ్వర్లు, బాబయ్య అభినందించారు.

జాతర పుస్తకాల పంపిణీ

కోట : తూర్పుకనుపూరు జాతర విశిష్టతను తెలుపుతూ కనుపూరు జాతర పేరుతో ఎన్‌బీకేఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు గాది శ్రీనివాస్ రచించిన పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. ముత్యాలమ్మ జాతరలో పాటించే సంప్రదాయాలు, ఆచారాలను పుస్తకంలో వివరించినట్లు గాది శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో చేవూరు శ్రీనివాసులు, శివకుమార్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కోట : మండలంలో ప్రతి రైతూ తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో నిరంజన్‌కుమార్ తెలిపారు. ఆయన గురువారం గూడలి రైతు సేవా కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రకియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇస్తామన్నారు. దాని ద్వారానే ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. మండలంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ 70 శాతం పూర్తయిందన్నారు.

పొలానికి దారి చూపాలని వినతి

గూడూరు రూరల్ : మండలంలోని మంగళపూరు గ్రామంలోని పేదల పొలాలకు వెళ్లేందుకు దారి చూపించాలని ఎంపీపీ బూదూరు గురవయ్య కోరారు. ఆయన గురువారం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో దారి విషయంపై హైకోర్టును ఆశ్రయించినట్టు తెలిపారు. దారి చూపించాలని కోర్టు ఆర్డర్ ఇచ్చిందన్నారు. ఈ క్రమంలో భూములకు దారి చూపించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. ఓజిలి పెంచలయ్య, వల్లూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్‌కు చెక్

కోట: మహిళలు తప్పనిసరిగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవాలని తిరుపతి స్విమ్స్ వైద్యులు పద్మావతి, హరిత తెలిపారు. కోటలో గురువారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. మహిళలకు మామోగ్రామ్, పాప్‌స్మియర్ పరీక్షలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు చేశారు.

భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ జాతర

పెళ్లకూరు : మండలంలోని కొత్తూరు గ్రామదేవత ముత్యాలమ్మ జాతరను గురువారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. చలువ పందిళ్లు వేసి మామిడి తోరణాలతో తీర్చిదిద్దారు. అమ్మవారికి ఉదయం కుంకుమార్చన, ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు. భక్తులుఎదురు కుంభాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ సంచి కృష్ణయ్య, గ్రామస్తులు చంద్రయ్యానాయుడు, పెంచలయ్య, సునీల్, సురేష్, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.


మానవాళికి మార్గదర్శకం ఖురాన్

- షబేఖదార్‌కు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ఖురాన్ పఠనంతో సమస్యలకు పరిష్కారం

నాయుడుపేట టౌన్ : మనిషి మంచి మార్గంలో నడిచేందుకు అవతరించిన దివ్య గ్రంథమే ఖురాన్. ఖురాన్ పఠనంతో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ముస్లింల నమ్మకం. అంతేగాక మానవుడు ఎలా జీవించాలి, సమస్యను ఎలా పరిష్కరించుకోవాలి, తల్లిదండ్రులు, భార్యాపిల్లలు, పెద్దలతో ఎలా ఉండాలి అన్న విషయాలను ఖురాన్‌లో పొందుపరిచారు. పవిత్ర ఖురాన్ సూచించిన మార్గాన్నే మహమ్మద్ ప్రవక్త అనుసరించి ఆచరించారు. మహమ్మద్ ప్రవక్తకంటే ముందు ప్రవక్తలు 103 ఆకాశ గ్రంథాలను భూమిపైకి తీసుకువచ్చారని మతపెద్దలు చెబుతున్నారు. చివరి ప్రవక్త అయిన మహమ్మద్ సల్లేలా హు ఆలైహివ సల్లం కాలంలో ఖురాన్ 104వ గ్రంథంగా అవతరించింది. ఇది చివరిదే కాకుండా అన్ని గ్రంథాలకంటే ఉన్నతమైనదిగా మౌలానాలు పేర్కొంటున్నారు.

30 భాగాలుగా ఖురాన్ విభజన

పవిత్ర ఖురాన్‌లో 114 అధ్యాయాలు ఉన్నాయి.



జామీయ మసీదులో బోధనలు చేస్తున్న మౌలానా అబ్బు బకార్ ముస్లీంలు

వీటినే సూరాలు అంటారు. సూరే ఫాతిహా మొదటి అధ్యాయం కాగా సూరే నాస్ చివరి అధ్యాయం. సూరే యాసిన్ ఖరాన్‌కు గుండె వంటిదని మహమ్మద్ ప్రవక్త బోధించారు. ఇందులో వాక్యాన్ని ఆయాత్ అంటారు. మొత్తం 6666 అయాతేలు, 540 రుకులు ఖురాన్‌లో ఉన్నాయి. సంపూర్ణ దివ్య ఖురాన్‌ను 30 భాగాలుగా విభజించి వాటిని 30 పారాలుగా పేర్కొన్నారు. ఖురాన్‌ను కంఠస్తం చేసిన వారిని హఫీజులుగా పిలుస్తారు. ఖురాన్ చదివి దాన్ని అమలు చేసే వారికి స్వర్గలోక ప్రాప్తి, నరక విముక్తి లభిస్తాయని మత పెద్దలు, మౌలానాలు చెబుతున్నారు. ఖురాన్ పఠించేవారికి ప్రశాంతతోపాటు ఎంతో మనశ్శాంతి లభిస్తుంది.

రంజాన్ మాసంలో ఖురాన్ పఠనం పుణ్యం

రంజాన్ మాసంలో దివ్య ఖురాన్ అవతరించడంతో ఈ మాసానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ మాసంలోనే షబేఖదర్ రాత్రి అవతరించడంతో ఆ రాత్రికి విశిష్టస్థానం లభించింది. 104 దివ్యగ్రంథాల్లో కొన్ని ముఖ్యమైన గ్రంథాలు రంజాన్ మాసంలో అవతరించాయి. రంజాన్ మాసంలో ఖురాన్‌కు ఎక్కువ సంబంధం ఉండడంతో ముస్లింలు ఈ మాసంలో ఎక్కువగా ఖురాన్‌ను పఠిస్తారు.

తరాబీ నమాజులకు అత్యంత ప్రాముఖ్యత

రంజాన్ మాసంలో ప్రతి రోజూ రాత్రి ఖరాన్ పఠిస్తూ చేసే తరాబీ నమాజులకు అత్యంత ప్రాముఖ్యత ఉంటుంది. ఈ నమాజులో ప్రతి రోజూ రాత్రి ఖురాన్‌లో ఒక పారాలను 20 రకాతులతో నమాజు చేస్తూ 30 రోజుల్లో 30 పారాలను పూర్తిగా చదివి వినిపిస్తారు.

ఎంత చదివినా ఆసక్తి తగ్గని గ్రంథం ఖురాన్



ఖురాన్ ఎంత చదివినా ఆసక్తి తగ్గదు. ప్రతి రోజూ నమాజు చేసే వారు రోజులో కనీసం యాబై సార్లు ఫాతిహా సూరా పారాయణం చేస్తారు. దీంతో విసుగు, విరక్తి దరిదాపుల్లోకి రావు. ఖురాన్‌లోని ప్రతి వాక్యమూ మనం ఎలా బతకాలో చెబుతుంది. వాటి జీవితాన్ని తీర్చిదిద్దుకుంటే విజయవంతమైన, సంతృప్తికర జీవితాన్ని ఆస్వాదించవచ్చు.

-షేక్ అబ్బుబకార్
జామీయ మసీదు మౌలాన, నాయుడుపేట

ఖురాన్‌ను నేర్పేవారు ఉన్నతులు



ఖురాన్‌ను నిత్యం పఠిస్తూ ఇతరులకు నేర్పేవారు అందరికంటే ఉన్నతులు. హదీస్ ప్రకారం ఒక హఫీస్ (ఖురాన్‌ను కంఠస్తం చేసిన వ్యక్తి) పదిమంది వ్యక్తులను నరకం నుంచి కాపాడతారు. అత్యంత పవిత్రత ఉండే ఈ గ్రంథాన్ని నేలపై ఉంచరాదు. చేతుల్లో పట్టుకుని చదువుకోవాలి లేదా కొద్దిగా ఎత్తులోనే ఉంచి చదువుకోవాలి.

- పఠాన్ ఇస్మాయిల్, మక్కా మసీదు
మసీదు మౌలాన. నాయుడుపేట

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు



నాయుడుపేటలో జామియా మసీదులో ప్రత్యేక నమాజు చేస్తున్న ముస్లింలు

షబే ఖదర్‌ను పురస్కరించుకుని పట్టణంలోని జామియా, అమీర్‌షావలీ, నూర్, మక్కా మసీదులతోపాటు ఎల్ఏసాగరం పాత, కొత్త బీడీ కాలనీ, పొగొట్టం, మునిరత్నం, చంద్రబాబు నాయుడు నగర్ కాలనీలోని అల్‌మదినా, షాహి, ఇబ్రహీమ్, బిలాల్, ఎబదర్ మసీదుల్లో గురువా రం రాత్రి నుంచి జాగారాలు చేస్తూ ప్రత్యేక ప్రా ర్థనలు చేశారు. షబే ఖదర్ రాత్రి దివ్య ఖురాన్ అవతరించిన మహిమ గల రాత్రిగా మత పెద్ద లు వివరించారు. మత పెద్దలు మాట్లాడుతూ మనిషిలో క్రమశిక్షణ, ఐక్యత, ప్రేమ, దానగు ణం తదితర ఎన్నో సుగుణాలను అలవరుచుకునే విధానమే రంజాన్ మాసమని వివరించారు. ప్ర తి ఒక్కరూ తమ సంపాదనలో కొంత భాగాన్ని పేదలకు దానం చేయాలని సూచించారు. బంగారు నగలు, వెండి ఇతరత్రా అభరణాల విలువలో రూ.లక్షకు రూ.2,500ల చొప్పున జకాత్‌గా తీసి పేదలకు దానధర్మాలు చేయాలన్నారు. అదే విధంగా ఫీత్ర(దానం) ఎంతో ముఖ్యమన్నారు. కుటుంబంలో ఎంత మంది వుంటే అంత మంది పేరున కచ్చితంగా ఫీత్ర చేయాలన్నారు. ఈ ఏడాది ఈ ప్రాంతంలో ఒక ఫీత్ర రూ.100లుగా నిర్ణయించినట్లు వివరించారు. షబే ఖదర్ జాగారం చేసిన ముస్లింలకు ఆదివారం ఉదయం సహరి విందును ఏర్పాటుచేశారు.

ఉపసర్పంచ్ ఎన్నిక వాయిదా

కోట : మండలంలోని ఎన్పీ కొత్తపాళెంలో గురువారం జరగాల్సిన ఉపసర్పంచ్ ఎన్నిక వాయిదా పడింది. ఇటీవల ఒక వార్డు సభ్యుడు మృతి చెందాడని, దీంతో ఉప సర్పంచ్ ఎన్నికను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు.

నేడు ఎన్‌బీకేఆర్‌లో మ్యూజిక్ ఫెస్ట్

కోట : కాలేజీ సెలబ్రేషన్స్‌లో భాగంగా విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో శుక్రవారం మ్యూజిక్ ఫెస్ట్-2025ను ఘనంగా నిర్వహించనున్నట్లు డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 7 గంటలకు మ్యూజిక్ ఫెస్ట్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఇందులో ప్రముఖ సినీ గాయని మంగ్లీ, వారి బృందం పాల్గొని ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ మ్యూజిక్ ఫెస్ట్‌ను ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు, సిబ్బంది మాత్రమే తిలకించే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. మ్యూజిక్ ఫెస్ట్‌ను లైవ్ స్ట్రీమింగ్ యూట్యూబ్ ద్వారా ప్రతి ఒక్కరూ చూడొచ్చని, గూగుల్ లింక్‌ని షేర్ చేస్తామని వెల్లడించారు. యాక్ట్ చాయిస్ ఛానల్ ద్వారా తిలకించే విధంగా లైవ్ ప్రోగ్రాం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై విచారణ

వాకాడు : మండలంలో ఉపాధి హామీ కింద చేసిన పనుల్లో అవకతవకలపై గురువారం అధికారులు విచారణ చేపట్టారు. ఇటీవల నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో పలు పంచాయతీల్లో చేసిన పనులపై అభియోగాలు వచ్చాయి. వాటిపై ఏపీడీ వరప్రసాద్ విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వాకాడులోని ఫీల్డ్ అసిస్టెంట్ వసంతమ్మపై వచ్చిన అభియోగాలపై గ్రామస్తులతో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టామన్నారు. విచారణలో వచ్చిన వివరాలను పీడీ శ్రీనివాసులుకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీవో విజయమ్మ పాల్గొన్నారు.

సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏ గ్రేడ్

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏ గ్రేడ్ సర్టిఫికెట్ వచ్చినట్టు ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకరశర్మ తెలిపారు. కళాశాలలో గురువారం 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు గాను అకాడమిక్ ఆడిట్ నిర్వహించారు. అకాడమిక్ అడ్వైజర్లుగా నెల్లూరు డీకేడబ్ల్యూ మహిళా కళాశాల ఇంగ్లీష్ అధ్యాపకురాలు ఎస్ వింధ్యావళి, శ్రీకాళహస్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు బి.దుర్గా అనూజ అన్ని విభాగాల రికార్డులను పరిశీలించారు. అత్యుత్తమ విద్యా ప్రమాణాలను పాటించడమే కాకుండా కళాశాల అభివృద్ధికి అధ్యాపకులు చేస్తున్న కృషిని వారు ప్రశంసించారు. అనంతరం కళాశాల కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఎగ్జిట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. కళాశాల అనతి కాలంలోనే చాలా అభివృద్ధిని సాధించందని కొనియాడారు. కళాశాలకు ఏ గ్రేడ్‌ని ప్రకటిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ వీ రాజా, అకాడమిక్ కోఆర్డినేటర్ డీ ఉషారాణి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏ గ్రేడ్ ప్రకటిస్తున్న అధికారులు

ఎన్‌బీకేఆర్‌లో పరిగ్రాహ్-2కే25 సదస్సు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో గురువారం పరిగ్రాహ్-2025 శాస్త్ర సాంకేతిక సదస్సు నిర్వహించారు. ఇందులో పలు ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొని తమ ప్రాజెక్టులను సమర్పించారు. ఉత్తమ ప్రాజెక్టులక బహుమతి అందజేశారు. పోస్టర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్, ఇంజినీర్డ్ ట్రస్ వంటి అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, హెచ్‌వోడీ శ్రీనివాస్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సంజయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి

శివప్రసాద్‌కు నివాళి

చిట్టమూరు : మండల వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీవీ రమణయ్యను ఆ పార్టీ మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, పలువురు నాయకులు పరామర్శించారు. బీవీ రమణయ్య సోదరుడు శివప్రసాద్‌రావు ఉత్తర క్రియలు గురువారం నిర్వహించారు. పలువురు నేతలు పాల్గొని మృతుడి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి కస్తూర్‌రెడ్డి, గూడూరు నియోజకవర్గ యువత అధ్యక్షుడు మాచిరెడ్డి సుధీర్ రెడ్డి, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు వాకాటి అశ్విన్ రెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షుడు లోకేష్ రెడ్డి, జెడ్పీటీసీ చిప్పల వెంకటయ్య, ఎంపీటీసీ పక్కీరయ్య, దువ్వూరు గోపాల్ రెడ్డి, ఆశ మధు, వైసీ పుట్టబాబు పాల్గొన్నారు.



మృతుడు శివప్రసాద్ రావు చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న నాయికులు

పాస్టర్ ప్రవీణ్ మృతి మిస్టరీని ఛేదించాలి


నాయుడుపేట టౌన్ : గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలో ప్రముఖ పాస్టర్ ప్రవీణ్ పడగడాల మృతి మిస్టరీని ఛేదించాలని నాయుడుపేట క్రైస్తవ సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. వారు గురువారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద పాస్టర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. వారికి ముస్లిం మైనారిటీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ పాస్టర్ మృతికి కారణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయుడుపేట పాస్టర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు వినయ్‌కుమార్, బిషప్ మైకేల్ బెన్‌హర్, ఎస్ఏఎల్‌సీ చర్చి మాజీ పీసీసీ చైర్మన్ కేజే జ్ఞానానందం, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షుడు కాళహస్తి భవన్, సూళ్లూరుపేట నియోజవర్గ కన్వీనర్ కేఎంపీ కళాచంద్ర, ముస్లిం మైనారిటీ నియోజకవర్గ కన్వీనర్ షేక్ షబ్బీర్, ఎగుదాల విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పాస్టర్‌కు నివాళులర్పిస్తున్న క్రైస్తవ సంఘాల వారు

కుష్టువ్యాధిగ్రస్తులకు దోమతెరలు

రాపూరు: మండలంలోని రావిగుంటపల్లి నజరత్ లెప్రసి కాలనీలో వున్న కుష్టువ్యాధి గ్రస్తులకు గురువారం వేపినాపి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ప్రమీలా రాజకుమారి దోమ తెరలు, బ్రెడ్, బిస్కెట్లు, పండ్లు అందజేశారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వేసవిలో ఎండలు ఎక్కువగా ఉంటాయని, వోఆర్ఎస్ తాగాలని సూచించారు. సూపర్‌వైజర్ లింగమూర్తి, ఇందిరమ్మ, పద్మావతి, విజయలక్ష్మి, అంకయ్య పాల్గొన్నారు.



దోమతెరలు అందజేస్తున్న ప్రమీలారాజకుమారి

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

గూడూరు రూరల్ : గూడూరు పట్టణ సమీపంలోని టిడ్కో ఇళ్ల సమీపంలో యువకుడు మృతిచెంది ఉండడాన్ని పోలీసులు ఆలస్యంగా గురువారం గుర్తించారు. పోలీసుల కథనం మేరకు.. టిడ్కో ఇళ్ల సమీపంలో నివసించే సోహిల్(19) చికెన్ దుకాణంలో పనిచేస్తూ తల్లికి తోడుగా ఉన్నాడు. వారం నుంచి కనిపించడం లేదని అతని తల్లి నాలుగు రోజుల క్రితం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో టిడ్కో ఇళ్ల సమీపంలోని ముళ్ల పొదల వద్ద దుర్గంధం వెదజల్లుతుండడంతో స్థానికులు పరిశీలించి మృతదేహం ఉన్నట్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మిస్సింగ్ అయిన సోహిల్ తల్లిని పిలిపించి పరిశీలించగా మృతదేహం తన కుమారుడిదేని గుర్తించింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పలు కుటుంబాలకు నేదురుమల్లి పరామర్శ

రాపూరు/బాలాయపల్లి (సైదాపురం) : మండలానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకుల కుటుంబ సభ్యులు ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం వారిని పరామర్శించారు. పోకురుపల్లికి చెందిన దేసు సుబ్బారెడ్డి మామ పుల్లారెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మద్దెలమడుగు సెంటర్ వద్ద బండిగోపాల్‌రెడ్డి సతీమణి రమణమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, జిల్లా ఆర్గనైజేషన్ కార్యదర్శి దందోలు లక్ష్మీనారాయణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బోడ్ల మధుసూదన్‌రెడ్డి, తిరుపతి పార్లమెంట్ మైనారిటీ కార్యదర్శి ఖాదర్‌బాషా పాల్గొన్నారు. అదే విధంగా బాలాయపల్లి మండలం జయంపు గ్రామానికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ వెందోటి మధుసూదన్‌రెడ్డి తల్లి సుగుణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి, ఆయకట్టు మాజీ ప్రెసిడెంట్ మనోహర్‌రెడ్డిని పరామర్శించారు. పార్టీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, వెంకటగిరి రూరల్ అధ్యక్షుడు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డక్కిలి అధ్యక్షుడు చింతల శ్రీనివాసులురెడ్డి, సైదాపురం మండల అధ్యక్షుడు మన్నారపు రవికుమార్ యాదవ్, మహిళా విభాగం అధ్యక్షురాలు కాటూరు రామతులసి, యువజన విభాగం అధ్యక్షులు శ్రీనివాసరాజు, ఆర్టీఐ విభాగం అధ్యక్షులు ఆరి శంకరయ్య పాల్గొన్నారు.



మద్దెలమడుగులో రమణమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేదురుమల్లిరామ్‌కుమార్‌రెడ్డి



పల్లారెడ్డికి నివాళులర్పిస్తున్న నేదురుమల్లి



కలువాయి : దుంపా కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నేదురుమల్లి



వెందోటి కుటుంబ సభ్యులకు పరామర్శ

దుంపా కుటుంబ సభ్యులకు పరామర్శ

కలువాయి(సైదాపురం) : ఇటీవల మృతి చెందిన దుంపా రామచంద్రారెడ్డి ఉత్తర క్రియలు గురువారం దాచూరులో నిర్వహించారు. ఇందులో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొని రామచంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. జెడ్పీటీసీ అనీల్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఎం.కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ఎంపీకి కృతజ్ఞతలు

చిల్లకూరు : రైతులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా సాగరమాల రోడ్డు నిర్మాణంలో మార్పులు చేసేలా కేంద్ర మంత్రి గడ్కరీని ఒప్పించిన తిరుపతి ఎంపీ గురుమూర్తికి గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. సాగరమాల రోడ్డు వల్ల పలు గ్రామాలకు, పొలాల్లోకి వెళ్లే వీలులేకుండా పోయింది. ఈ విషయంపై తిరుపతి ఎంపీకి విన్నవించారు. స్పందించిన ఆయన గురువారం కేంద్ర మంత్రి గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. సాగరమాల రోడ్డు డిజైన్‌ను మరోసారి తనిఖీ చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎంపీకి చిల్లకూరు మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

వెంకటగిరి(సైదాపురం): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్ఈ సురేంద్ర తెలిపారు. ఆయన గురువారం వెంకటగిరిలోని 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో తలెత్తుతున్న సమస్యల నివారించి మారుమూల ప్రాంతాల వారికి సైతం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఫీడర్ల వారిగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు నెలలో 2వ తేదీ నుంచి 10 వరకు విడతల వారిగా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈఈ వై.శ్రీనివాసులు, డీఈఈ రవిమునిచంద్ర, ఏఈ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలు ఉపసంహరించుకోవాలని నిరసన

గూడూరు రూరల్ : వినియోగదారులపై మోపిన విద్యుత్ ట్రూ అప్ చార్జీలను ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. వారు గురువారం స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అక్కడ నరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాజాగా ట్రూ అప్ చార్జీల పేరుతో భారం మోపడం తగదన్నారు. గూడూరు చల్లకాలువ ప్రాంతంలో శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని కోరారు. గూడూరు రెండో పట్టణంలోని వంకినగుంట వద్ద నివసిస్తున్న వారిని ఖాళీ చేయాలని ఇచ్చిన నోటీసులను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనస్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జోగి శివకుమార్, రమణయ్య, వెంకటరమణారెడ్డి శేఖరాచారి, మధు, అడపాల ప్రసాద్, మణి, నారాయణ, చంద్రయ్య, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు నిషాన్ జెండా ఆవిష్కరణ

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని హజరత్ అమీర్ షావలీ ఉరుసును పురస్కరించుకుని గురువారం రాత్రి నిషాన్ జెండా ఆవిష్కరించారు. ఉరుసు నిర్వహణ కమిటీ సభ్యులు, ముజావర్లు దర్గాలో పూల దుప్పటి వేసి ప్రత్యేక పాతేహలు జరిపారు. నిషాన్ జెండాకు శ్రీవారి గంధం లేపనం చేసి దర్గా వద్ద ఆవిష్కరించారు. ఉరుసును ఏప్రిల్ 3, 4, 5 తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారు. పెద్దలు కనమర్లపూడి సుబ్రమణి, హాజీ నిజాం, దొర్నాదుల గోపాల్, పఠాన్ అమీర్‌ఖాన్, రషీద్, ముజావర్లు సుభహాని, హిదయతుల్లా, అతావుల్లా తదితరులు పాల్గొన్నారు.



నిషాన్ జెండాను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు, ముజావర్లు

యువకుడి మృతదేహం లభ్యం

కలువాయి(సైదాపురం) : క్వారీ గుంతలో పడి మృతి చెందిన ఏలూరు పెంచల ప్రసాద్ మృతదేహాన్ని గురువారం గజ ఈతగాళ్లు వెలికితీశారు. కేశమనేనిపల్లికి చెందిన ఏలూరు పెంచలప్రసాద్ స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి మృతిచెందిన విషయం తెలిసిందే. మృతదేహం బురదలో ఇరుక్కుపోయినట్టు గుర్తించారు. ఈ క్రమంలో గురువారం ఉదయం గజఈతగాళ్లు నీటిలో గాలించి మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

చిల్లకూరు: మండలంలోని ఈదులవారిపాళెం మలుపు వద్ద బైక్ బోల్తాపడి యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. ఓజిలి మండల బత్తలాపురానికి చెందిన కాకాణి ప్రణయ్‌కుమార్ గురువారం ముత్యాలమ్మ జాతరకు వెళ్లాడు. తిరిగి బైక్‌లో ఇంటికి వెళుతుండగా ఈదులవారిపాళెం సమీపంలో బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. తీవ్రంగా గాయపడిన అతన్ని పోలీసులు 108లో గూడూరు ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి నెల్లూరుకు తీసుకెళ్లారు. కేసు దర్యాప్తులో ఉంది.

లైంగిక దాడి యత్నం కేసులో ఐదేళ్ల జైలు

నెల్లూరు(లీగల్): బాలికపై లైంగిక దాడికి యత్నం కేసులో నేరం రుజువు కావడంతో నాయుడుపేట శ్రీరామ్ నగర్‌కు చెందిన కార్యం అంకయ్యకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.22 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో ప్రత్యేక కోర్టు జడ్జి సిరిపిరెడ్డి సుమ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2019 ఏప్రిల్ 28న అంకయ్య స్వీట్లు ఇస్తానని ఆశ చూపి బాలికను ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. బాలిక ఏడుపు విన్న పొరుగింటి వారు కేకలు వేయడంతో నిందితుడు పారిపోయాడు. బాలిక ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు నాయుడుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం నిందితుడిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అంకయ్యపై నేరం రుజువు కావడంతో శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ప్రత్యేక పీపీ చంద్రశేఖర్ వాదించారు.